డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR



విలేకరులు కావలెను..

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..

సంప్రదించండి: 8121158069



| పెద్దపల్లి Peddapalli | మంగళవారం Tuesday | 24-02-2026 24-02-2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక: 37 Issue: 37 | పేజీలు: 08 Pages: 08 | వెల :02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|


## రాష్ట్రపతి భవన్‌లో రాజాజీ ఉత్సవం

- రాజాజీ ఆదర్శాలను స్మరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మానసిక వలస పాలన నిర్మూలనకు రాజాజీ సందేశం
- ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1 వరకు ప్రదర్శన




జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:

రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన రాజాజీ ఉత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజాజీగా ప్రసిద్ధి పొందిన చక్రవర్తి రాజగోపాలాచారి జ్ఞాపకాలను స్మరించారు. ప్రభుత్వ గృహానికి వచ్చినప్పుడు రాజాజీ తన గదిలో రామకృష్ణ పరమహంస, మహాత్మా గాంధీ చిత్రాలను ఉంచారని ఆమె తెలిపారు. ఆ చర్య ద్వారా భారతదేశం అధికారికంగా డొమినియన్‌గా ఉన్నప్పటికీ భారతీయుల హృదయాల్లో స్వరాజ్యం -మిగతా 2 లో...




- కేబినెట్ సంచలన నిర్ణయం
- ఎల్ అండ్ టీ నుంచి పూర్తి బాధ్యతల స్వీకరణకు ఆమోదం.
- పర్యవేక్షణకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉపసంఘం.
- రూ.2 వేల కోట్ల ఈక్విటీ చెల్లింపు, రూ.13 వేల కోట్ల రుణ బదలాయింపు.

# మెట్రో స్వాధీనం

జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 23:

హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఈరోజు అధికారిక ఆమోదం తెలిపింది. నగర ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో, ఆర్థిక వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. మెట్రో స్వాధీన ప్రక్రియను సమర్థంగా అమలు చేయడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులను సభ్యులుగా నియమించారు. -మిగతా 2 లో...

## జమ్ముకశ్మీర్‌లో ఎదురుకాల్పులు

- ముగ్గురు ఉగ్రవాదులు మృతి.
- కిష్ట్వార్ జిల్లాలో ఉత్కంఠ పరిస్థితి.
- జైష్ ఎ మహమ్మద్‌తో సంబంధం అనుమానం.
- మంచుతో కప్పుకున్న అడవుల్లో ప్రత్యేక దాడి.



2

## నేపాల్‌లో ఘోర బస్సు ప్రమాదం


- లోయలోని త్రిశూలి నదిలో పడిన ప్రయాణికుల బస్సు.
- 18 మంది మృతి, 26 మందికి తీవ్ర గాయాలు.
- విదేశీ పర్యాటకులు కూడా బాధితుల్లో ఉండటం విచారం.



## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం


2

- ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు
- 9,97,075 మంది విద్యార్థులు హాజరు
- 30 వేల సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ



## తెలంగాణలో చిరుజల్లులు

- వేడి నుంచి ఉపశమనం
- హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం
- నైరుతి బంగాళాఖాత ద్రోణి ప్రభావం
- మరికొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాల సూచన



## రైతుల బకాయిలు విడుదల చేయాలి.

- రైతు సంఘర్షణ సభలో కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు.
- కలెక్టరేట్ ముట్టడి, వినతిపత్రం అందజేత.
- రుణమాఫీ, రైతు భరోసాపై ప్రభుత్వంపై విమర్శలు.






2

## హైదరాబాద్‌లో హార్ట్‌ఫర్డ్ సాంకేతిక కేంద్రం

- హైదరాబాద్‌లో విస్తరణకు ప్రపంచ బీమా సంస్థ నిర్ణయం
- ఒకటిన్నర లక్ష చదరపు అడుగుల్లో ఆధునిక సదుపాయాలు
- 1,200 మందికి ఉపాధి అవకాశాలు




జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 23:

నానక్‌రామ్‌గూడలో హార్ట్‌ఫర్డ్ ఇండియా సాంకేతిక కేంద్రాన్ని సోమవారం మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ప్రపంచ బీమా రంగంలో ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిన హార్ట్‌ఫర్డ్ హైదరాబాద్‌ను తమ సాంకేతిక, ఆవిష్కరణ విస్తరణకు ఎంచుకోవడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. సుమారు ఒకటిన్నర లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కేంద్రం 1,200 మంది నిపుణులను సమర్థంగా పనిచేయించగల సామర్థ్యంతో రూపుదిద్దుకుంది. ఈ -మిగతా 2 లో...

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి ఫోటోపై చర్చ

- రేవంత్ రెడ్డి ఫోటోతో పాటు భట్టి విక్రమార్క ఫోటో ప్రతిపాదన
- సుప్రీంకోర్టు వ్యాఖ్యల అనంతరం రాజకీయ చర్చ
- క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం సాధ్యమా?



జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 23:

తెలంగాణ ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి - 2 లో

# మెట్రో స్వాధీనం

-మొదటిపేజీ తరువాయి...

ఈ ఉపసంఘం ఆర్థిక, న్యాయ, పరిపాలనా అంశాలను పరిశీలిస్తూ స్వాధీన ప్రక్రియను పర్యవేక్షించనుంది.

గత సంవత్సరం జరిగిన సూత్రప్రాయ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించడంతో పాటు, సుమారు రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ ప్రక్రియ అప్పటినుంచి దశలవారీగా కొనసాగుతోంది. మెట్రో ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి, సేవలను మరింత సమర్థంగా నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర రవాణా రంగంలో దీర్ఘకాలిక ప్రణాళికల అమలు, విస్తరణ ప్రాజెక్టుల వేగవంతం, ప్రయాణికులకు మెరుగైన సదుపాయాల కల్పన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్గాలు వెల్లడించాయి. మెట్రో స్వాధీనం అనంతరం సేవల నాణ్యత, నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# జమ్ముకశ్మీర్‌లో ఎదురుకాల్పులు

**జనం వాయిస్, జమ్ముకశ్మీర్, ఫిబ్రవరి 23:**

జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని కిస్త్‌వార్ జిల్లాలో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య తీవ్ర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు ఉగ్రవాదులు మృతిచెందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మంచుతో కప్పుకున్న పర్వత ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఛత్రూ అటవీ ప్రాంతంలోని ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న స్పష్టమైన సమాచారం అందడంతో భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని ముట్టడి చేశాయి. లొంగిపోవాలని హెచ్చరించినప్పటికీ, ఉగ్రవాదులు ముందుగా కాల్పులు ప్రారంభించారు. దాంతో భద్రతా దళాలు ప్రతిగా కాల్పులు జరిపాయి. కొన్ని గంటల పాటు కొనసాగిన కాల్పుల్లో ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో ఒకరు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ సంస్థకు అనుబంధంగా పనిచేస్తున్న కీలక నాయకుడు సైఫుల్లా అయ్యి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఘటన అనంతరం ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. శాంతి భద్రతల పరిరక్షణ కోసం అదనపు దళాలను మోహరించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఉగ్రచర్యలను అడ్డుకునేందుకు భద్రతా వ్యవస్థ మరింత అప్రమత్తంగా ఉందని అధికారులు స్పష్టం చేశారు.

## రాష్ట్రపతి భవన్‌లో రాజాజీ ఉత్సవం

-మొదటిపేజీ తరువాయి...

స్థిరపడిందనే స్పష్టమైన సందేశాన్ని రాజాజీ ఇచ్చారని రాష్ట్రపతి పేర్కొన్నారు. మానసిక వలస పాలన నిర్మూలనకు రాజాజీ ఆదర్శం నిలిచిందని తెలిపారు. భారత వారసత్వంపై గర్వం కలిగి వలస పాలన అవశేషాలను తొలగించాలనే జాతీయ ఉద్యమంలో రాజాజీ ఆలోచనలు ప్రతిఫలిస్తున్నాయని అన్నారు. రాజాజీ ఉత్సవం భాగంగా రాజాజీ జీవితం, సేవలపై ప్రత్యేక ప్రదర్శనను రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1, 2026 వరకు కొనసాగనుంది. రాజాజీ దేశ నిర్మాణంలో పోషించిన పాత్రను ఈ సందర్భంగా విశదీకరించనున్నారు. రాజాజీ ఆలోచనలు, విలువలు నేటి తరానికి కూడా ప్రేరణగా నిలుస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. దేశం తన చరిత్ర, సంస్కృతి పట్ల గర్వంతో ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు.

# నేపాల్‌లో ఘోర బస్సు ప్రమాదం

**జనం వాయిస్, ఖాట్మండు, ఫిబ్రవరి 23:**

పొరుగు దేశం నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ధాడింగ్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి రహదారి నుంచి సుమారు 300 మీటర్ల దిగువన ఉన్న లోయలో ప్రవహిస్తున్న త్రిశూలి నదిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 18 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మందికి తీవ్ర గాయాలు కాగా, వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. పోఖారా నుంచి ఖాట్మండుకు వెళ్తున్న ఈ బస్సు సోమవారం తెల్లవారుజామున ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 44 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే నేపాల్ పోలీసులు, సైన్యం, సాయుధ బలగాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. బస్సు లోతైన లోయలో పడిపోవడం, చీకటి పరిస్థితులు ఉండటంతో రక్షణ చర్యలు క్లిష్టంగా మారాయి. మరణించిన వారిలో ఆరుగురు మహిళలు, 12 మంది పురుషులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారిలో ఒక మహిళ, ఒక పురుషుడు న్యూజిలాండ్ దేశానికి చెందిన పర్యాటకులుగా గుర్తించారు. గాయపడిన వారిలో కూడా పలువురు విదేశీ పర్యాటకులు ఉన్నట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఖాట్మండు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. అయితే అతివేగమే ఈ దుర్ఘటనకు కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 23:**

తెలంగాణ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న పరీక్షల నిర్వహణపై ఇంటర్ బోర్డు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి కృష్ణాదిత్య కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, మొదటి సంవత్సరం నుంచి 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 404 ప్రభుత్వ కళాశాలలు, 221 ఎయిడెడ్ కళాశాలలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 7 ఇతర విద్యాసంస్థలను ఎంపిక చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్ కళాశాలలు అధికంగా ఉండగా, మిగతా జిల్లాల్లో ప్రభుత్వ కళాశాలలకు ప్రాధాన్యత ఇచ్చారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా దాదాపు 30 వేల సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని, అయితే సమయపాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులను బయటకు పంపబోమని, ప్రశ్నాపత్రాలు కూడా బయటకు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హాల్ టికెట్ల వివాదాలపై స్పందిస్తూ, ఫీజులు చెల్లించలేదనే కారణంతో ఎవరినీ ఇబ్బంది పెట్టబోమని తెలిపారు. కోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు కూడా హాల్ టికెట్లు జారీ చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని, విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య వెల్లడించారు.

# రైతుల బకాయిలు విడుదల చేయాలి.


**జనం వాయిస్, జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 23:**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు సంఘర్షణ సభలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. సభ అనంతరం రైతుల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి పెద్ద ఎత్తున రైతులతో కలిసి కలెక్టరేట్‌కు బయలుదేరారు. పోలీసుల అనుమతి లేదని గేటుకు తాళం వేయడంతో కవితతో పాటు రైతులు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సభలో మాట్లాడుతూ నాగర్ కర్నూల్ ఘటనలో చిన్నారి మృతి బాధాకరమని పేర్కొంటూ మౌనం పాటించాలని కోరారు. తెలంగాణలో కుల వివక్షకు తావు లేకూడదని స్పష్టం చేశారు. జోగులాంబ అమ్మవారిపై తనకు ప్రత్యేకమైన భావోద్వేగం ఉందని, భవిష్యత్ కార్యక్రమాలను గద్వాల్ నుంచే ప్రారంభిస్తామని ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్రను గుర్తుచేసి, రాబోయే సామాజిక ఉద్యమంలో కూడా వారు ముందుండాలని విజ్ఞప్తి చేశారు. సీడ్ పత్తి రైతుల బకాయిలు వారం రోజుల్లో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, లేదంటే దీక్షకు దిగుతామని హెచ్చరించారు. అర్ధరాత్రి కరెంట్ సరఫరా, యూరియా కొరత, యాప్ ద్వారా బుకింగ్ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని విమర్శించారు. రైతుల రుణమాఫీ విషయంలో పూర్తి న్యాయం జరగలేదని, ఇంకా 15 లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రతి రైతుకు రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కృష్ణమ్మ, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నా నడిగడ్డకు నీళ్లు అందడం లేదని, తుమ్మిళ్ల, నెట్టెంపాడు పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ ప్రాంతానికి న్యాయం చేయలేకపోయాయని అన్నారు. రైతుల కోసం పోరాడే నాయకత్వం అవసరమని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో జాగృతి బలంగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. రైతులు, మహిళల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని కవిత తెలిపారు.

## తెలంగాణలో చిరుజల్లులు

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 22:**

కూకట్‌పల్లి జనసేన పార్టీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఘనంగా జనసేన పార్టీలో చేరారు. తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ చేతుల మీదుగా గుండెల విజయకుమార్, కె. శ్రీను, ఏ. మహేష్, సి. నరేష్, ఎం. శ్రీనివాస్, వై. లక్ష్మి, వై. మల్లేష్, గుండెల పావని, ఆర్. ఆండాలు, బి. బాలమ్మ తదితరులు పార్టీ కండువాలు ధరించి సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా చేరికల నేతలు మాట్లాడుతూ జనసేన అధినేత, ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, పారదర్శక రాజకీయాల కోసం జనసేనతో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు మండపాక కావ్య, యువ నాయకుడు యడమ రాజేష్, నగర స్థానిక సంస్థల తాత్కాలిక కమిటీ సభ్యుడు మహేష్, రత్న సాయి తదితరులు పాల్గొన్నారు. జనసైనికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.



# హైదరాబాద్‌లో హార్ట్‌ఫర్డ్ సాంకేతిక కేంద్రం

-మొదటిపేజీ తరువాయి...

పెట్టుబడి రాష్ట్ర సమాచార సాంకేతిక రంగానికి మరింత బలాన్ని అందిస్తుందని మంత్రి వివరించారు. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణ సమాచార సాంకేతిక వాతావరణంపై పెరుగుతున్న నమ్మకాన్ని ఈ కేంద్రం ప్రతిబింబిస్తోందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ముందుచూపు విధానాలు, సమగ్ర మౌలిక వసతులు రాష్ట్రాన్ని సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలబెడుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా వేగంగా ఎదుగుతున్న నేపథ్యంలో ఇలాంటి పెట్టుబడులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణ సమాచార సాంకేతిక రంగాన్ని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



## ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి ఫోటోపై చర్చ




మొదటిపేజీ తరువాయి...

విక్రమార్క ఫోటో కూడా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటో ఏర్పాటు అంశంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేస్తూ, డిప్యూటీ సీఎం ఫోటో ఉండటంలో తప్పేమీ లేదని వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో రాష్ట్రాల్లో ఉప ముఖ్యమంత్రుల అధికారిక ప్రాధాన్యతపై కొత్త చర్చ మొదలైంది. ఇదే నేపథ్యంలో తెలంగాణలోని ప్రభుత్వ కార్యాలయాల్లో భట్టి విక్రమార్క ఫోటో కూడా ఏర్పాటు చేయాలనే ఆలోచనకు వేగం వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించే అవకాశముందని సమాచారం. ప్రభుత్వ పరిపాలనలో ఉప ముఖ్యమంత్రి బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని ఫోటో ఏర్పాటు చేయాలనే అభిప్రాయం కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంపై తుది స్పష్టత క్యాబినెట్ చర్చల అనంతరం వెలువడే అవకాశముంది. రాష్ట్ర రాజకీయాల్లో ఈ అంశం మరోసారి చర్చకు దారి తీస్తోంది.

# సౌమ్య కుటుంబానికి అండగా ప్రభుత్వం

- కోటి రూపాయల పరిహారం అందజేత
- సోదరుడికి ఉద్యోగ నియామకం
- దాడులపై కఠిన చర్యల హెచ్చరిక

**జనం వాయిస్, నిజామాబాద్, ఫిబ్రవరి 23:**



గంజాయి అక్రమ రవాణాదారుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. ఫిబ్రవరి 1న జరిగిన అంత్యక్రియల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బాధిత కుటుంబానికి పూర్తి స్థాయిలో సహాయం అందించామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఇప్పటికే సౌమ్య కుటుంబానికి కోటి రూపాయల చెక్కును అందజేశారు. అదేవిధంగా సౌమ్య సోదరుడు గాజుల శ్రవణ్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ నియామక పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అందజేశారు. కుటుంబానికి ఆర్థిక, ఉద్యోగ భరోసా కల్పించడం ద్వారా ప్రభుత్వ నిబద్ధతను చాటుకున్నట్లు అధికారులు తెలిపారు. సౌమ్య మరణించి కేవలం ఇరవై మూడు రోజుల్లోపే పరిహారం, ఉద్యోగ నియామకం చేపట్టడం ప్రజా ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకోవడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి తగిన గౌరవం, భరోసా అందించడం కొనసాగుతుందని తెలిపారు. అక్రమ రవాణాదారుల దాడులను తీవ్రంగా ఖండిస్తూ, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ సిబ్బందికి అవసరమైన రక్షణ చర్యలపై, ఆయుధాల కల్పన అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడించింది.

# జోగిపేట వాసికి జీవనాధార పరికరాల అందజేత

- ఊపిరితిత్తుల రోగితో బాధపడుతున్న మల్లేశంకు సహాయం
- ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి మంత్రి అండ
- ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యం

**జనం వాయిస్, జోగిపేట, ఫిబ్రవరి 23:**



తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని మరోసారి చాటిచెప్పారు. జోగిపేట 16వ వార్డుకు చెందిన గంజి మల్లేశం దీర్ఘకాలంగా తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న విషయం మంత్రి దృష్టికి రావడంతో వెంటనే స్పందించి అవసరమైన వైద్య పరికరాలను అందజేశారు. గంజి మల్లేశం కుటుంబం ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రతినెలా పది వేల రూపాయల వ్యయంతో ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్, బైప్యాప్ యంత్రాన్ని అద్దెకు తీసుకుంటూ చికిత్స కొనసాగిస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన మంత్రి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ప్రభుత్వం తరఫున పూర్తి సహాయం అందించాలని నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సోమవారం మినిస్టర్ నివాస సముదాయంలో మంత్రి దామోదర రాజనర్సింహ స్వయంగా గంజి మల్లేశం కుటుంబ సభ్యులకు ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్, బైప్యాప్ యంత్రాన్ని అందజేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందనే సందేశాన్ని ఈ చర్య స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మల్లేశం కుటుంబ సభ్యులు మంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మరోసారి పేర్కొన్నారు.

# మల్కాజిగిరిలో ఉచిత హెల్మెట్ బ్యాంక్

- హెల్మెట్ లేకుంటే అక్కడికక్కడే అందజేత
- 24 గంటల్లో తిరిగి అప్పగించాలి
- జరిమానా కంటే ప్రాణరక్షణే లక్ష్యం

**జనం వాయిస్, మల్కాజిగిరి, ఫిబ్రవరి 23:**

మల్కాజిగిరి ట్రాఫిక్ విభాగం ప్రజల ప్రాణరక్షణను ప్రధానంగా భావిస్తూ "హెల్మెట్ బ్యాంక్" అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ద్విచక్ర వాహనం నడుపుతూ హెల్మెట్ లేకుండా పట్టుబడిన వారికి అక్కడికక్కడే ఉచితంగా హెల్మెట్ అందజేసే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకం ప్రకారం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్నవారు ప్రాథమిక వివరాలు నమోదు చేసి హెల్మెట్‌ను తాత్కాలికంగా తీసుకోవచ్చు. తమ సొంత హెల్మెట్ కొనుగోలు చేసిన తరువాత 24 గంటల లోపు తీసుకున్న హెల్మెట్‌ను తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. జరిమానా విధించడంపై మాత్రమే దృష్టి పెట్టకుండా, ప్రాణాలను కాపాడడం ముఖ్యమనే సందేశాన్ని పోలీసులు అందిస్తున్నారు. సంగీత్ చౌరస్తా వంటి ప్రధాన కూడళ్ల వద్ద ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ చర్య ఉపకరిస్తుందని అధికారులు పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం తప్పనిసరి అనే నియమాన్ని కఠినంగా అమలు చేస్తూనే, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. ప్రజలు కూడా స్వచ్ఛందంగా సహకరించి తమ భద్రత కోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ అధికారులు కోరుతున్నారు. జరిమానా భయంతో కాకుండా, ప్రాణాల విలువను గుర్తించి రహదారులపై జాగ్రత్తగా ప్రయాణించాలని సూచిస్తున్నారు.



# జాతీయ స్థాయిలో రాణించాలి: సన్‌ప్రీత్ సింగ్

- రాష్ట్ర స్థాయి క్రీడల్లో పతక విజేతలకు సత్కారం
- విధి ఒత్తిడుల్లోనూ ప్రతిభ ప్రదర్శన ప్రశంసనీయం
- మరింత సాధనతో జాతీయ పతకాల లక్ష్యం

**జనం వాయిస్, వరంగల్, ఫిబ్రవరి 23:**




రాబోయే రోజుల్లో మరింత శ్రమిస్తే జాతీయ స్థాయిలో కూడా పతకాలను సాధించగలమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలను సాధించిన వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులకు సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సన్‌ప్రీత్ సింగ్ ముందుగా పతకాలను గెలుచుకున్న క్రీడాకారులను వ్యక్తిగతంగా కలిసి అభినందించారు. హాకీ క్రీడాకారులు సంయుక్తంగా కమిషనర్‌కు హాకీ జెర్సీని బహూకరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో టేబుల్ టెన్నిస్ విభాగంలో కాంస్య పతకం సాధించిన కమిషనర్‌కు ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ పతకాన్ని అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిడులు ఉన్నా క్రీడల్లో ప్రతిభ చూపించి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎక్కువ సంఖ్యలో పతకాలు కైవసం చేసుకోవడం సంతోషకరమని తెలిపారు. ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి జాతీయ స్థాయి పోటీల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. క్రీడల్లో రాణించే వారికి శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిసిపిలు దార కవిత, అంకిత్ కుమార్, శిక్షణాధికారి మనిషా నేహ్రా, అదనపు డిసిపిలు సురేష్ కుమార్, రవి, శ్రీనివాస్, ఏసిపిలు నాగయ్య, సురేంద్ర, జితేందర్ రెడ్డి, మధుసూదన్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది క్రీడాస్ఫూర్తిని మరింత పెంపొందించుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ బలోపేతానికి సమన్వయం అవసరం

- జిల్లా అధ్యక్షుల శిక్షణ శిబిరంలో దిశానిర్దేశం
- రాహుల్ గాంధీ ప్రధాని కావాలనే లక్ష్యం
- సామాజిక న్యాయమే కాంగ్రెస్ ధ్యేయం

**జనం వాయిస్, వికారాబాద్, ఫిబ్రవరి 23:**


వికారాబాద్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పాల్గొని పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేసినట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇరు రాష్ట్రాల నాయకులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పార్టీ మరింత బలపడుతుందని సూచించారు. దేశంలోని సామాజిక, ఆర్థిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసే లక్ష్యంతో జిల్లా అధ్యక్షులు కట్టుదిట్టమైన ప్రణాళికతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ వేదిక మాత్రమే కాదని, అంటరానితనం మరియు కుల వివక్ష నిర్మూలనకు పోరాడిన సామాజిక సంస్కరణల ఉద్యమమని భట్టి విక్రమార్క అన్నారు. వైకాం, చౌదర్ సత్యాగ్రహాల నుండి నేటి వరకు సామాజిక సమానత్వం కోసం కాంగ్రెస్ నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. రోహిత్ వేముల ఘటన సమయంలో రాహుల్ గాంధీ స్పందించిన తీరు ఆయనలోని సామాజిక స్పృహకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని అధికరణ 17, ఎస్సీ, ఎస్టీ అఘాయిత్య నిరోధక చట్టం, భూ సంస్కరణలు, ఉప ప్రణాళిక వంటి చారిత్రాత్మక నిర్ణయాలు కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. రాజ్యాంగ విలువలను కాపాడటం, సామాజిక న్యాయం అందించడమే పార్టీ లక్ష్యమని, ప్రతి కార్యకర్త పునరంకితం కావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

# గడ్డ పోతారం మున్సిపల్ తొలి సమావేశం

- ప్రజాసేవకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఐదు మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున నిధులు
- అనుమతుల్లేని నిర్మాణాలపై ఏకగ్రీవ తీర్మానం

**జనం వాయిస్, సంగారెడ్డి, ఫిబ్రవరి 23:**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం గడ్డ పోతారం మున్సిపాలిటీ తొలి మున్సిపల్ పాలకవర్గ సమావేశానికి పటాన్చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేసే అవకాశం కొద్ది మందికే లభిస్తుందని, ప్రజలు అందించిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పాలకవర్గానికి సూచించారు. రాబోయే ఐదేళ్లపాటు ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీకి పదిహేను కోట్ల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో హెట్రో పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ అనుమతులు లేకుండా పన్నెండు ఎకరాల్లో నిర్మాణాలు చేపడుతోందని ఆరోపిస్తూ, వెంటనే తొలగించేలా కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మా, ఉప చైర్మన్ మహేందర్ గౌడ్, కమిషనర్ వెంకటరామయ్య, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



# కుమ్మెర ఘటనపై కఠిన చర్యల డిమాండ్

- చిన్నారి మృతి ఘటనపై ఆగ్రహం
- డీజీపీని కలిసి వినతిపత్రం
- బాధ్యులపై కేసులు నమోదు చేయాలి



**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 23:**

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా కుల వివక్షకు పాల్పడుతూ ఆలయానికి వెళ్లిన వారిపై దాడి చేసి రెండు నెలల చిన్నారిని కాలితో తొక్కి హత్య చేసిన ఘటనపై మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పాలుపంచుకున్న కాంగ్రెస్ సర్పంచ్ మరియు అగ్రనాయకులపై వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో తెలంగాణ డీజీపీ బి శివదర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఇలాంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారి మృతి ఘటన రాష్ట్రాన్ని కలచివేసిందని పేర్కొన్నారు. కుల వివక్షకు తావులేకుండా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. చట్టం ముందు అందరూ సమానులని, బాధ్యులెవ్వరైనా వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించి రక్షణ కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిసి కమిషన్ మాజీ సభ్యులు కిషోర్ గౌడ్, సీహెచ్ ఉపేందర్, మాజీ ఎంపీపీ రాజు గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి చాకలి ఆనంద్, భరత్ గౌడ్, సుర్వి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

RNI NO:TGTEL/26/A0383
www.janamvoice.com
epaper.janamvoice.com
మంగళవారం
24- 02 - 2026


## శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాల పై డి ఈ ఓ చర్యలు తీసుకోవాలి

### ఎన్ ఎస్ యూ ఐ మండల ప్రెసిడెంట్ పసునుటి అన్వేష్

**జనం వాయిస్,ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండల కేంద్రం లోని బూజునూర్ గ్రామంలో ఉన్నటువంటి శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాల పై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఇల్లంతకుంట మండల NSUI మండల ప్రెసిడెంట్ పసునూటి అన్వేష్ కోరారు. ఎందుకంటే గత ప్రభుత్వాలు రేకుల షేడ్ లలో పాఠశాలలు నిషేధించి కొత్త భవనాలలో విద్యను బోధించాలి అని నిర్ణయిస్తే ఈ పాఠశాల యాజమాన్యం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు గా వ్యవహరిస్తూ ఆ షెడ్డులలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకవేళ జరగరానిది ఏదైనా జరిగి విద్యార్థులకు ఏదైనా హాని కలిగితే దానికి పూర్తి బాధ్యత ఎవరు వహిస్తారు అనే అంశం ప్రజలలో ఆలోచిస్తున్నారు అంతే కాకుండ వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ లభర్జనే ధ్యేయంగా ఆలోచించి కనీసం విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు లేకుండా కనీసం వాష్ రూమ్ లు లేకుండా పాఠశాల నడిపిస్తున్నారు ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా నడుస్తున్న ఈ పాఠశాలపై వెంటనే ఐజూా చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేస్తున్నాం లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరిస్తున్నాం అని ఆయన తెలిపారు.



## అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ (దిలీప్)

**జనం వాయిస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటున్న మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో గల అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, వంట విధానం, పరిశుభ్రత, పోషకాహార పట్టిక అమలు విధానం తదితర అంశాలను స్వయంగా పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించిన చైర్మన్ వారి ఆరోగ్య స్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రానికి వస్తున్న పసిపిల్లలకు సమయానికి, నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం సరైన మోతాదులో, పరిశుభ్ర వాతావరణంలో వండి అందించాలని, పిల్లల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని హెచ్చరించారు. అంగన్వాడీ టీచర్ మరియు ఆయమ్మలతో సమావేశమై చిన్నారుల బరువు, ఎత్తు కొలతలు, ఆరోగ్య రికార్డులు సక్రమంగా నమోదు చేస్తున్నారా అనే విషయాన్ని తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు,



బాలింతలకు అందించే పోషకాహారం కూడా నాణ్యతతో ఉండాలని, కేంద్రానికి వచ్చే ప్రతి లబ్ధిదారునికి పూర్తి స్థాయిలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ భవనం పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, శౌచాలయాల నిర్వహణ, వంటగది పరిస్థితి తదితర అంశాలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు ఉంటే వెంటనే నివేదించాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు ఆరోగ్యవంతంగా ఉండాలంటే బాల్యంలోనే సరైన పోషకాహారం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ చింతల శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ తదితర ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. వారు కూడా అంగన్వాడీ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ పిల్లల సంక్షేమం కోసం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, పోషణ, శ్రేయస్సు పట్ల మున్సిపల్ యంత్రాంగం కట్టుబడి ఉందని, అంగన్వాడీ కేంద్రాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బాలల అభివృద్ధికి పునాది వంటివని చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తూ ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత తీసుకువస్తామని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు చైర్మన్ ఈ పర్యటనను అభినందిస్తూ చిన్నారుల సంక్షేమం పట్ల చూపుతున్న శ్రద్ధకు కృతజ్ఞతలు తెలిపారు.

## రజక కుటుంబం పై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి

### - రజక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నిమ్మటూరి సాయికృష్ణ.



**జనం వాయిస్,హుజురాబాద్:**

హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో రజక సంఘం రాష్ట్ర నాయకులు నిమ్మటూరి సాయికృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానం తో దూసుకుపోతుంటే ఇండియా దేశంలో, తెలంగాణ లో నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మాదేవుని గుడిలోకి వస్తావా? మా దేవుని దర్శించు కుంటావా? సాకలి దాన అంటూ దుర్భసలాడుతూ, కొట్టరానిచోట తన్నరానిచోట అనరాని మాటలు అంటూ 6 గంటల చిత్రహింసలు పెట్టి రెండు నెలల పసి గుడ్డును కసాయి కొడుకులు కాలుతో తన్నితే క్షణంలో అక్కడేప్రాణం విడిచిన పసిబిడ్డ తనువు చాలించింది. ఇంకా కుల వివక్షత ఉందా? ఇంకా కులం ఉందా? అంటూ నంగనాచి కథలు చెప్పే రాజకీయ నాయ కులారా?ఈ ఘటన చూసైనా సిగ్గు శరం తెచ్చుకోవాలి.?ఎందుకంటే ఎస్సీలను గ్రామాల్లో వివక్షత గురి చేస్తే మాకెందుకులే అనుకున్న వారు. నేడు బిసి, సాకలి కుటుంబానికి వివక్షత వచ్చింది. దారుణంగా చిత్ర హింసలు పెట్టారు. కసాయి అగ్రకుల రెడ్డి దుర్మార్గులకు అక్కడున్నవారు ఎదురు చెప్పలేకపోయారు. న్యాయమా అన్యాయమా అని ప్రశ్నించలేకపోయారు. ముక్కుపచ్చలారని పసిగుడ్డు ఉసురు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్లో కేసు పెడితే పోలీసోడు కేసు కట్టలేదు?దాడికి పాల్పడ్డ రెడ్డి అగ్రకుల దూరంకారులను ఇంకా అరెస్టు చేయలేదు.? అంటే రాజ్యం ఎవరి పక్షాన ఉంది.? ఎవరిది రాజ్యం.? ఎవరి కోసం పని చేస్తుంది. ఈ దారుణాలు ఎంత కాలం చేస్తారు. వివక్ష పై దాడులను ఎదిరించి నిలిచేందుకు ఎవరు ముందుకు రావాలి. అగ్రకుల మనువాదుల దాడులకు ఎంతో మంది అమాయకులు ఇంకా ఎంత మంది బలి కావాలి. రాజ్యం శిక్షించకపోతే తప్పు చేసిన వారిని అరెస్టు చేయకపోతే ప్రజాస్వామ్యం ఉన్నట్టా లేకపోతే బలిసినోడికి చుట్టమైనట్టా.? నేటి నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన ఈ అవమాన మానవీయ ఘటన తెలంగాణ రాజ్యమంత విశ్వవ్యాప్తంగా చేసి దాడికి పాల్పడ్డదోషులను శిక్షించేదాకా, కేసు పెట్టిన ఎఫ్ఐర్ కట్ట కుండ అరెస్టు చేయకుండా కాలయాపన చేసిన ఏ పోలీస్ ఆఫీసర్ నైనా వదిలిపెట్టకుండా సస్పెండ్ చేసి జైల్లో వేసేదాకా వామపక్షాలు, దళిత బహుజన సంఘాలు, ప్రజా సంఘాలు మానవతా వాదులు, నాగర్ కర్నూలు జిల్లా దిక్కులు పిక్కటిల్లెల మరవడైన దాడి చేస్తే ఒంట్లో ఎన్నో ముక్కలు చలి పుట్టేలా ఉప్పనే కదలిరండి అంటూ పిలుపునిస్తున్నాయి. అగ్రకుల అహంకారాన్ని నడివీధిలో బట్టలిప్పి చెట్టుకు కట్టేసి పచ్చి కారం పోసి తన్ని తరిమితేనే ఇలాంటి ఘటనలు జరగవు అంటూ ఆవేదనకు గురవు తున్నారు. ఇకనైనా చైతన్య అవుదాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలంతా ఏకమవుదాం. పోరాడుదాం అసమానతలు, అంతరానితనం, వివక్ష, అస్పృశ్యత లేని సాంప్ర దాయాన్ని సంస్కృతిని విశ్వవ్యాప్తం చేద్దాం, దాడికి గురైన కుటుంబాన్ని ఆదుకుందాం అండగా ఉందాం అని అన్నారు. రజక సంఘం రాష్ట్ర నాయకులు నిమ్మటూరి సాయికృష్ణ సోమవారం రోజు హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రజక మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..మల్లన్న దర్శనం కోసం వెళ్లిన చాకలి చంద్రకళ కుటుంబాన్ని అడ్డు కొని, వారి కుటుంబం పై అగ్రకుల నాయకులు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అలాగే ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొలిపాక సారయ్య, నల్ల బాలరాజ్, కొలిపక శ్రీనివాస్, కొండపాక పవన్, నల్ల సుమన్,కొండపాక లక్ష్మి, నిమ్మటూరి రమ, వసంత, భూలక్ష్మి, సరూప, కొలిపాక రంగయ్య, ప్రజా సంఘాల నాయకులు,వేల్పుల ప్రభాకర్, సాదుల రవీందర్, బిసి ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలకమారి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్పకాయల సాగర్, నడిగొడ్డి రమేష్, మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, సుంకరి రాజమౌళి, కొలిపాక శ్రీనివాస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు నిర్బంధాలతో ప్రజాస్వామ్యాన్ని కుని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

### - బిజెపి హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు

**జనం వాయిస్, హుజురాబాద్:**

బిజెపి హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు అక్రమ అరెస్టును నిరసిస్తూ సోమవారం రోజున హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.వారు మాట్లాడుతూ ఒకవైపు బిజెపి ఎమ్మెల్యేలపై దాడులు మరోవైపు హిందువులపై దారుణమైన అకృత్యాలు జరుగుతున్న ఈ అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రాంచందర్ రావు ని, బిజెపి ఎమ్మెల్యేలను, ఎంపీలను, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ప్రశ్నించిన వారిని అక్రమ అరెస్టు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్య మానుకోవాలని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు బిజెపి సీనియర్ నాయకులు కొలిపాక శ్రీనివాస్ బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు తూముల శ్రీనివాస్ నరాల రాజశేఖర్ యాంసాని శశిధర్ ఓడ్నాల విజయ్ బొరగాల సారయ్య గంట సంపత్ డోరి ఐలయ్య కొడిమ్యాల పవన్ కుమార్ శ్రీధర్ కుత్తాడి కుమారస్వామి మోటపోతుల రాకేష్ దున్నపోతుల అశోక్ రాజేష్ ఖన్నా క్యాశ వెంకటేష్ నీలం రవీందర్ రామచంద్రం బోడిగే శూదర్శన్ తూర్పాటి తూర్పాటి రాజశేఖర్ పర్థం విజయ్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఈడబ్ల్యూఎస్ కోటాలో అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయాలి

### - ఓసి జేఏసీ జాతీయ నాయకులు, బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి

జనం వాయిస్,హుజురాబాద్:

అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ కోటాలో రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఓసి జేఏసి జాతీయ నాయకులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓసి లోని పేదల సమస్యలతో పాటు రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద ఓసి జెఏసి ఆధ్వర్యంలో జరిగిన మహా ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన ఎడవెల్లి కొండల్ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ బద్దంగా ఏర్పడ్డ 10శాతం ఈడబ్ల్యూఎస్ పై రాజకీయ పబ్బశీ కోసం కొన్ని దుష్ట శక్తులు ఆయా కులాల్లోని ప్రజలను మభ్య పెడుతూ చేస్తున్న అసత్య ప్రచారాలు, పన్నుతున్న కుట్రలను సాగనివ్వబోమని హెచ్చరించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పటిష్ట అమలుకు ఓసి ల స్థితి గతుల అధ్యయనానికి జాతీయ స్థాయిలో చట్టబద్ధత తో కూడిన ఓసి ల కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈడబ్లూస్ సర్టిఫికెట్ జారీకి వార్షిక ఆదాయ పరిమితిని 10 లక్షలకు పెంచాలని, ఈడబ్ల్యూఎస్ కోటాకు కేటాయించిన మిగిలిపోయిన బ్యాక్ లాగ్ పోస్టులను ఈడబ్ల్యూఎస్ వారితోనే భర్తీ చేయాలని డిమాండ్ ఆయన చేశారు. ఓసి లకు నేటికీ రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడం వల్ల జనరల్ స్థానాల్లో కనీసం 15 శాతం సీట్లు కూడా గెలుచుకోలేక తీవ్రంగా నష్టోతున్నారని




ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న 50 శాతం మించకుండా ఉన్న రిజర్వేషన్లలో ఓసి లకు కూడా రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

**రైతులకు గిట్టుబాటు ధర కనిపించాలి..**

రైతులకు ప్రస్తుత గిట్టుబాటుధర ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదని, రైతు తాను పండించిన పంటకు రైతులే గిట్టు బాటు ధర నిర్ణయించే భాగస్వామ్యం కల్పించే ప్రత్యేక చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈరోజు ధర్నా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

**ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి..**


గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలంటే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత, పెరుగుతున్న వ్యయాలు, అనిశ్చిత వర్షపాతం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పనులను వ్యవసాయ అనుబంధ పనులకు విస్తరించడంతో రైతులకు ఉపశమనం లభిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. పొలాల సమతలీకరణ, చెరువుల పునరుద్ధరణ, కాలువల శుభ్రపరిచే పనులు, వర్షపు నీటి సంరక్షణ, మట్టి సంరక్షణ చర్యలు వంటి కార్యక్రమాలను పథకంలో చేర్చాలని సూచించారు. ఇలా చేస్తే గ్రామీణ కూలీలకు సంవత్సరమంతా ఉపాధి లభించడంతో పాటు వ్యవసాయోత్పత్తి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.

వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న నేపథ్యంలో రైతుల అవసరాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకంలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణాభివృద్ధి, ఆహార భద్రత, రైతు ఆదాయం పెంపు లక్ష్యాలతో ఈ రెండు రంగాలను అనుసంధానం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చర్చలు జరిపి తగిన విధాన నిర్ణయాలు తీసుకోవాలని కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు.

# రాష్ట్ర స్థాయి నృత్య పోటీలలో విద్యార్థుల జయకేతనం

## -జమ్మికుంట ప్రఖ్యాతి నిలబెడుతున్న ప్రసంగి డాన్స్ స్టూడియో



**జనం వాయిస్, జమ్మికుంట:**

కరీంనగర్‌లోని రెయిన్ స్టార్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీలలో జమ్మికుంటకు చెందిన ప్రసంగి డాన్స్ స్టూడియో, ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చాటుతూ.. విశేష విజయాలు సాధించారు. జూనియర్ డ్యూయెట్ విభాగంలో ప్రకృతి, రసజ్ఞ ప్రథమ స్థానం పొందగా, జూనియర్ ఫోక్ సోలో విభాగంలో ప్రకృతి ప్రథమ స్థానం సాధించింది. జూనియర్ వెస్ట్రన్ సోలో విభాగంలో రసజ్ఞ తృతీయ బహుమతి అందుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ ,మేజిస్ట్రేట్ పమెలా సత్పతి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్ , అలాగే ప్రత్యేక అతిథిగా జబర్దస్త్ టీమ్‌కు చెందిన జీవన్ హాజరై విద్యార్థులనుఅభినందించారు.న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన సర్వేష్ , ఉమా మహేశ్వర్ , నక్క అశోక్ మాట్లాడుతూ. ."జమ్మికుంట పేరు ప్రతిష్టలను నిలబెట్టారు. మీరు ఎక్కడికి వెళ్లినా విజయాలు మీ సొంతం అవుతాయి" అని ప్రశంసించారు. ప్రసంగి డాన్స్ స్టూడియో, ఫిట్‌నెస్ సెంటర్ డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. జమ్మికుంటలో స్థాపించిన ఈ సంస్థ ద్వారా అనేక మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులను చేర్పించి, ఉన్నత స్థాయికి తీర్చిదిద్దేందుకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాస్టర్ ప్రసంగి, మాస్టర్ రాజు(రాజేష్)ని ఘనంగా సన్మానించారు. ఏప్రిల్ 1 నుంచి సమ్మర్ క్యాంప్ ఉంటుందని, జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలను చదువు తో పాటు వారికి ఇష్టమైన నృత్యం, డ్యాన్స్ ఇత రా లలో ప్రోత్సహించాలని ప్రసంగి డ్యాన్స్ స్టూడియో ప్రొప్రైటర్ శ్రీలత తెలిపారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ




**జనం వాయిస్, వీణవంక:**

మండలం లోని కొండపాక గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఇటీవలగట్టు అయిలయ్య తాటి చెట్టు పైనుండి ప్రమాదవశత్తు జారీపడి మృతుడి చెందగా వారి కుటుంబ సభ్యులను సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరుశరామ్ గౌడ్ పరామర్శించారు. మృతిని చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి, మృతి కి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.మృతి చెందిన కుటుంబానికి పది లక్షల రూపాయలను అందించాలని డిమాండ్ చేశారు. గత రెండేళ్ల నుండి గీత కార్మికుల కు సంబందించిన ఎక్స్ గ్రేసియా పెండింగ్ లో ఉండడం వలన బాదితులకు ఒక్క రూపాయి కూడా అందడం లేదన్నారు.ప్రతి గీత కార్మికుడుకి పూర్తి స్థాయిలో సేఫ్టి మోకులు ఇవ్వాలని కోరారు. వారి వెంట జిల్లా అధ్యక్షులు బుర్ర పరుశరామ్ గౌడ్, ఉపాధ్యాక్షుడు బుర్ర నర్సయ్య గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రాజల్లు గౌడ్, డివిజన్ అధ్యక్షుడు రాజారాం గౌడ్,మండల అధ్యక్షుడు తిప్పని సమ్మయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు మ్యాడ గోని మొగిలి, ఇల్లందకుంట ఉపాధ్యాక్షుడు మోతుకూరి శ్రీనివాస్,గీత కార్మికులు గట్టు స్వామి, గట్టు మధు, మ్యాడగోని శ్రీనివాస్,ఉయ్యాల రాజు, చింతల సమ్మయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో నేటి నుండి గరికపాటి ప్రవచనాలు

## - అయ్యప్ప ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

**జనం వాయిస్, మంథని:**

మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనాలు మంగళవారం నుండి మూడు రోజులపాటు మంథనిలో ధర్మ ప్రచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించ నున్న గరికపాటి ప్రవచనాలకు ధర్మ ప్రచార సంస్థ నిర్వాహకులు అయ్యప్ప స్వామి దేవాలయం అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, అవధాని మోహన్ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటులో పూర్తి చేశారు. సోమవారం అయ్యప్ప స్వామి దేవాలయం వారంలో గరికపాటి ప్రవచనాలు నిర్వహించే సభా ప్రాంగణం వద్ద మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ తో పాటు వైస్ ఛైర్మెన్ ముస్కుల సహేందర్ రెడ్డి, అవధాని మోహన్ శర్మ ఆధ్వర్యంలో సభా ప్రాంగణంలోని సుందరంగా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశ్రీ గరికపాటి నరసింహారావు చే నేటి నుండి మూడు రోజులపాటు నిర్వహించే ప్రవచనాల కోసం వస్తున్న గరికపాటికి స్థానిక



అంబేద్కర్ చౌరస్తా నుండి అయ్యప్ప దేవాలయం వరకు మహిళల కోలాటాల తో వేద పాఠశాల విద్యార్థులతో ఆయనకు స్వాగతం పలక టానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రవచనాలు ఆలకించటానికి పట్టణ ప్రాంతంలో నుండే గాక ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇది అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణ

- ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు.
- జిల్లాలో 22 పరీక్షా కేంద్రాల ఏర్పాటు.
- భద్రత, వైద్య సదుపాయాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి.



**జనం వాయిస్, పెద్దపల్లి, ఫిబ్రవరి 23:**

జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు జె. అరుణ శ్రీ, డి. వేణు లతో కలిసి పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ థియరీ పరీక్షలకు జిల్లాలో జనరల్, వృత్తి విద్య కలిపి మొత్తం 10,367 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వీరి కోసం 22 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పరీక్షలకు ముందు కేంద్రాలను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో పార్కింగ్ నిషేధించాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని తెలిపారు. పరీక్షా హాల్స్‌లో తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరేందుకు అనుకూలంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రశ్నాపత్రాల సీల్స్‌ను చీఫ్ సూపరింటెండెంట్ సమక్షంలోనే తెరవాలని పేర్కొన్నారు. పారా మెడికల్ సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక మందులు ప్రతి కేంద్రంలో అందుబాటులో ఉండేలా వైద్య శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణపై స్థానిక సంస్థలు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కల్పన, ఆర్డీఓలు గంగయ్య, సురేష్, ఏసీపీ జి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


# సింగరేణి అధికారులను కలిసిన నూతన కార్పొరేటర్



**జనం వాయిస్, గోదావరిఖని టౌన్ ఫిబ్రవరి 23**

వీర్లపల్లి లక్ష్మీపురం గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు సోమవారం రోజున వీర్లపల్లి పరిధి లో సింగరేణి సి హెచ్ పి అధికారులను నూతనంగా ఎన్నికయిన కార్పోటర్ కందుల స్వరూప సతీష్ కొక్కిరాల శ్రీనివాస్ రావు ఆధ్వర్యం లో అధికారులను సన్మానించారు అనంతరం వీర్లపల్లి కి సంబంధించిన పలు అంశాలు పైన చర్చించి వీర్లపల్లి లో సమస్యలు పైన సింగరేణి అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కారం చేస్తాము అని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు సి హెచ్ పి. డీ వై జిఎం బాలాజీ రావు, ఏరియా ఇంజినీర్ సృజన్ మొహెర్, పాల్గొన్నారు

# ఎక్కేది ఆర్డినరీ బస్సు- కొట్టేది ఎక్స్ ప్రెస్ టిక్కెట్టు.









- బస్సుల కొరత పేరిట ప్రయాణికుల పై భారం మోపుతున్న ఆర్టీసీ యాజమాన్యం.
- మంథని డిపో మేనేజర్ పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెఖీంకల సురేష్.

**జనం వాయిస్, మంథని:**

మంథని బస్సు డిపో నుండి పెద్దపల్లి, కరీంనగర్ వైపుగా వెళుతున్నటువంటి మంథని డిపో బస్సులు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నియమ నిబంధనలను పాటించకుండా మంథని డిపో అధికారులు ఇష్టమైన రీతిలో బస్సులను సంబంధిత రూట్లకు పంపిస్తున్నారు. సోమవారం మంథని నుండి కరీంనగర్ వెళ్తున్న

టి ఎస్ 22 టి 7244 పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల వద్ద నుండి ఎక్స్ ప్రెస్ చార్జీలు వసూలు చేసి ప్రయాణికులను కొంత ఆశ్చర్యానికి గురి చేశారు. ఇదేంటని ప్రశ్నించిన కొందరు ప్రయాణికులకు బస్సు ఎక్కేముందే ఎక్స్ ప్రెస్ అని చెప్పాము కదా అని ఆ బస్సు కండక్టర్ సమాధానం చెప్పసాగారు. మంథని డిపో నుండి గత కొద్ది రోజులుగా పల్లవెలుగు ఆర్డినరి బస్సులను వేసి ఎక్స్ ప్రెస్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని గతంలో తెలిపినప్పటికి మంథని డిపో యాజమాన్యం తీరు మారడం లేదు. పల్లెవెలుగు బస్సులు వేసి ఎక్స్ ప్రెస్ చార్జీలు వసూలు చేస్తు పేద మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొడుతున్న మంథని బస్సు డిపో మేనేజర్ పై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని ఇలాంటివి తిరిగి పునరావృతం కాకుండా మంథని నుండి ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తున్న ప్రయాణికులను ఆర్టీసీ చార్జీల పేరిట ఇబ్బందులకు గురి చేయవద్దని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశాడు.

# సినిమా

# ఉదయపూర్‌లో ‘విరోష్’ పెళ్లి సందడి.

## బయల్దేరిన విజయ్‌రష్మిక, మార్చి 4న హైదరాబాద్‌లో విందు వేడుక



టాలీవుడ్‌లో క్రేజీ జంటగా పేరొందిన విజయ్ దేవరకొండ రష్మిక మందన్న వివాహ వేడుకల సందడి మొదలైంది. గత కొద్ది రోజులుగా వీరి ప్రేమ, పెళ్లిపై అనేక ఊహాగానాలు వినిపించినప్పటికీ అధికారికంగా స్పందించని ఈ జంట, తాజాగా తమ వివాహాన్ని ప్రకటించడంతో అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ నెల 26న రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ నగరంలో వివాహం జరగనుండగా, వేడుకల కోసం ఇద్దరూ ఇప్పటికే అక్కడికి బయల్దేరారు. విమానాశ్రయంలో వీరు కనిపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందుతున్నాయి. విజయ్‌తో పాటు ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ కూడా ఉండటం అభిమానులను ఆకట్టుకుంది. ఉదయపూర్‌లోని ప్రఖ్యాత రాజభవనంలో ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయని సమాచారం. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా వివాహం నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఒకే సందేశంతో తమ వివాహాన్ని ప్రకటించిన ఈ జంట, అభిమానులు ప్రేమగా పిలిచే ‘విరోష్’ అనే పేరునే పెళ్లి శీర్షికగా నిర్ణయించుకున్నట్లు వెల్లడించింది. “మా కంటే ముందుగా మీరు మా కోసం ఆలోచించారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు ‘విరోష్’. మీ ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం” అంటూ భావోద్వేగంగా తెలియజేశారు. ఉదయపూర్‌లో వివాహం అనంతరం మార్చి 4న హైదరాబాద్ నగరంలో ఘన విందు వేడుక నిర్వహించనున్నారు. నగరంలోని ఒక ప్రముఖ అతిథి గృహంలో ఈ కార్యక్రమం జరుగనున్నట్లు సమాచారం. సినీ రంగ ప్రముఖులు, రాజకీయ నాయకులు, సన్నిహితులు ఈ వేడుకకు హాజరుకానున్నారని తెలుస్తోంది. ఎంతోకాలంగా అభిమానులు ఎదురుచూస్తున్న ఈ జంట వివాహం సామాజిక మాధ్యమాల్లో మరింత ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది.

## విజయ్ సేతుపతి సాయిపల్లవి జంట రాబోతోంది.. పూర్తి వివరాలు ఇవే



తమిళ చిత్రసీమలో అగ్ర దర్శకుడిగా పేరుగాంచిన మణిరత్నం దర్శకత్వంలో కొత్త ప్రేమకథా చిత్రం రూపుదిద్దుకోనుంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్ర కోసం తొలుత శింబు, ధ్రువ్ విక్రమ్ వంటి నటుల పేర్లు వినిపించినప్పటికీ, చివరికి కోలీవుడ్ స్టార్ నటుడు విజయ్ సేతుపతిను ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయం చిత్ర వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈ చిత్రంలో కథానాయికగా సహజనటి సాయిపల్లవి నటించనుంది. భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇచ్చే ప్రేమకథగా ఈ చిత్రం తెరకెక్కనుందని తెలుస్తోంది. ఇప్పటికే సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ స్వరపరచిన కొన్ని గీతాల పనులు పూర్తయ్యాయని సినీ వర్గాల సమాచారం. కథ, సంగీతం, నటీనటుల ఎంపిక ఇలా అన్నింటిలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. విజయ్ సేతుపతి ప్రస్తుతం అనేక చిత్రాలతో బిజీగా ఉన్నాడు. అవి పూర్తయ్యిన వెంటనే ఈ చిత్రాన్ని ప్రారంభించేందుకు మణిరత్నం సిద్ధమవుతున్నారని సమాచారం. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఇక మణిరత్నం గతంలో విడుదలైన చిత్రం పెద్దగా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయిన నేపథ్యంలో, ఈసారి ప్రేక్షకులను ఆకట్టుకునేలా బలమైన కథతో ముందుకు రావాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. విజయ్ సేతుపతి తన వైవిధ్యమైన నటనతో పాత్రలకు ప్రాణం పోసే నటుడిగా పేరుపొందాడు. సాయిపల్లవి సహజమైన నటన, నృత్య ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందింది. వీరిద్దరి జంటగా తెరకెక్కే ఈ ప్రేమకథపై ఇప్పటికే సినీప్రియుల్లో భారీ ఆసక్తి నెలకొంది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశముంది.

## ఆదర్శ కుటుంబం ఏకే 47 క్రేజీ వార్త..

### - దుబాయ్‌కు వెంకీత్రివిక్రమ్ బృందం..!

టాలీవుడ్‌లో రూపొందుతున్న కుటుంబ వినోదాత్మక చిత్రం ‘ఆదర్శ కుటుంబం ఏకే నలభైఏడు’పై ఆసక్తికరమైన వార్త వెలువడింది. వెంకటేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన శీర్షిక ప్రకటన చిత్రాలు ప్రేక్షకుల్లో మంచి స్పందనను రాబట్టగా, ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్ గురించి తాజా సమాచారం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు దాదాపు నలభై శాతం చిత్రీకరణ పూర్తయిందని, తదుపరి షెడ్యూల్ కోసం చిత్ర బృందం త్వరలోనే దుబాయ్ నగరానికి వెళ్లనుందని సమాచారం. అక్కడ పది రోజులపాటు కీలక సన్నివేశాల చిత్రీకరణ చేపట్టనున్నారు. ముఖ్యంగా దుబాయ్ నేపథ్యంలో వచ్చే దృశ్యాలు చిత్రానికి వైభవాన్ని తీసుకురావడంతో పాటు కథను మరింత ఉత్కంఠభరితంగా మలుస్తాయని సినీ వర్గాల సమాచారం. ఈ చిత్రంలో ప్రముఖ తమిళ హాస్య నటుడు యోగిబాబు కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే జూన్ నాటికి మొత్తం చిత్రీకరణ పూర్తయ్యే అవకాశముందని తెలుస్తోంది. గతంలో ‘నువ్వు నాకు నచ్చావ్’, ‘మల్లీశ్వరి’ వంటి విజయవంతమైన చిత్రాలకు రచయితగా పని చేసిన త్రివిక్రమ్, ఇప్పుడు వెంకటేశ్‌తో దర్శకుడిగా మొదటిసారి చేతులు కలపడం ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవల విడుదలైన తొలి చూపు చిత్రాలు ప్రేక్షకుల్లో మంచి కుతూహలాన్ని రేకెత్తించాయి. ఈ చిత్రంలో కథానాయికగా శ్రీనిధి శెట్టి నటిస్తుండగా, కీలక పాత్రలో నారా రోహిత్ కనిపించనున్నారు. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కుటుంబ వినోదం, నేర అంశాలు మేళవించిన కథతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



## నెగెటివిటీపై సమంత ఆగ్రహం..




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తూ స్వయంగా నిర్మిస్తున్న చిత్రం ‘మా ఇంటి బంగారం’పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్రబృందం అధికారికంగా విడుదల తేదీని ప్రకటించగా, ఈ వేసవి కానుకగా మే 15న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. ప్రచారంలో భాగంగా అభిమానులతో ముచ్చటించిన సమంత, తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న విమర్శలు, నెగెటివ్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. తన వ్యక్తిగత విషయాల్లోకి జోక్యం చేసుకుంటూ ఉద్దేశపూర్వకంగా నెగెటివిటీ పంచే వారిని ఏమాత్రం సహించబోనని స్పష్టం చేశారు. అలాంటి వారిని వెంటనే తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో ‘బ్లాక్ లిస్టు’లో పెడతానని వెల్లడించారు. ఎవరినైనా తాను బ్లాక్ చేస్తే, వారు తనను బాధపెట్టారని కాదు, తన ప్రపంచంలోకి వారికి ప్రవేశం లేదని అర్థమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రశంసలు తనను అతిగా ప్రభావితం చేయవని, విమర్శలు కూడా తనను కుంగదీయలేవని తెలిపారు. తన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటానో, తన సామాజిక మాధ్యమ పేజీని కూడా అలాగే స్వచ్ఛంగా ఉంచుకోవాలని భావిస్తానని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో హద్దులు దాటి ప్రవర్తించే ట్రోలర్లకు సమంత వ్యాఖ్యలు గట్టి హెచ్చరికగా మారాయి. ప్రస్తుతం ‘మా ఇంటి బంగారం’ చిత్రంపై సినీప్రియుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఈ సినిమా విడుదల తర్వాత సమంతకు మరింత విజయాన్ని తీసుకురాగలదా అన్న చర్చ సినీ వర్గాల్లో సాగుతోంది.

## మరో విజయంపై కన్నేసిన చిట్టి..

సినిమా రంగంలో అందం, అభినయం ఉన్నా అదృష్టం కలిసి రాని కథానాయికలు చాలామంది ఉన్నారు. అలాంటి వారిలో ఫరియా అబ్దుల్లా ఒకరు. చేసింది కొద్ది సినిమాలే అయినా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. కానీ ఆశించిన స్థాయిలో అవకాశాలు, విజయాలు మాత్రం అందుకోవడంలో వెనుకబడి పోతోంది. జాతిరత్నాలు సినిమాతో కథానాయికగా పరిచయమైన ఫరియా, తొలి చిత్రంతోనే మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ చిత్రంలో ఆమె చూపిన అమాయకత్వం, సహజ నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలి విజయంతో వరుస అవకాశాలు అందుకున్నా, తర్వాతి చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోయాయి. తర్వాత చేసిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన రీతిలో ఆడలేదు. మత్తు వదలరా 2 లో శ్రీ సింహ తో కలిసి నటించి కొంతమేర మెప్పించింది. అయితే ఆ తరువాత వచ్చిన చిత్రాలు వరుసగా నిరాశపరిచాయి. దీంతో మరో గట్టి విజయాన్ని అందుకోవాలనే తపనతో కథల ఎంపికలో మరింత జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. కథానాయికగానే కాకుండా ప్రత్యేక గీతాల్లోనూ ఆమె ప్రేక్షకులను మెప్పించింది. బంగార్రాజు చిత్రంలో ప్రత్యేక గీతంతో ఆకట్టుకుంది. అలాగే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ లో అఖిల్ అక్కినేని తో, ఒక రాజు ఒక రాణి లో నవీన్ పొలిశెట్టి తో అతిథి పాత్రల్లో కనిపించింది. చివరిగా గుర్రం పాపి రెడ్డి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా అది కూడా ఆశించిన విజయాన్ని అందించలేదు. అయితే సామాజిక మాధ్యమాల్లో మాత్రం ఫరియా చురుకుగా ఉంటూ అభిమానులతో అనుసంధానం కొనసాగిస్తోంది. ఆకర్షణీయ చిత్రాలతో ఎప్పటికప్పుడు సందడి చేస్తూ తనకంటూ ప్రత్యేక అభిమాన వర్గాన్ని ఏర్పరుచుకుంటోంది. ఇప్పుడు మరో బలమైన కథతో ప్రేక్షకుల ముందుకు రావాలనే సంకల్పంతో ప్రయత్నాలు ముమ్మరం చేసింది ఫరియా అబ్దుల్లా. సరైన కథ, సరైన అవకాశం దొరికితే మరోసారి పెద్ద విజయాన్ని అందుకోవాలని ఈ చిట్టి ఆశగా ఎదురుచూస్తోంది.



Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com